ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

7

శనివారం 18 అక్టోబరు 2025



భక్తులు సంతృప్తి చెందేలా దర్శనం జరగాలి



ఉచిత దర్శనం లైన్ ఉండాల్సిందే

వీఐపీలకు ప్రత్యేక సమయం కేటాయించండి

సమన్వయంతో పని చెయ్యండి

ఆలయాల్లో కార్తీకమాస ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

భీమవరం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో భక్తులకు సంతృప్తికరమైన దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలని దేవదాయ ధర్మాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్, కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. శుక్రవారం రాష్ట్రంలోని శివాలయాల ఈవోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలోని పంచారామ క్షేత్రాలైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం, పాలకొల్లు క్షీరామ లింగేశ్వరస్వామి ఆలయంతో పాటు పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం, జుత్తిగ ఆలయాల ఈవోలు కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. చిన్న దేవాలయమైనా, పెద్ద దేవాలయమైనా ఉచిత దర్శనం ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. దర్శనాల సమయంలో అభిషేకాలు చెయ్యటం వల్ల భక్తులకు స్వామివారి దర్శనం జరగదని అందువల్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వీఐపీలకు ప్రత్యేక సమయం ఉండేలా చూడాలని దీనివల్ల సామాన్యభక్తులకు దర్శనాలకు ఇబ్బంది ఉండదన్నారు. భక్తుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవలసి బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈనెల 22 నుంచి వచ్చేనెల 20 వరకు కార్తీకమాసం ఉంటుందని ప్రత్యేక రోజుల్లో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయండి

అధికారులతో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి సమీక్ష

భీమవరం రూరల్/ ఉండి అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో పౌర సరఫరాలు, సహకార, రవాణా శాఖల అధికారులతో ధాన్యం సేకరణపై సమావేశం నిర్వహించారు. త్వరలో ధాన్యం సేకరణ ప్రారంభం కానున్న దృష్ట్యా సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. గోనెసంచులు, వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డీఎస్‌వో సరోజ, సివిల్ సప్లయ్ మేనేజర్ ఇబ్రహీం, జిల్లా సహకార శాఖ అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోనె సంచులు అందుబాటులో ఉంచాలి

రైతు సేవాకేంద్రాల్లో గోనె సంచులను అందుబాటులో వుంచాలని జేసీ ఆదేశించారు. శుక్రవారం ఉండి రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అధికారులతో చర్చించారు. రైతులకు సంబంధించి సమాచారం వివరాలు ప్రదర్శనను పరిశీలించి తగు సూచనలు అందించారు. రైతులు పండించిన ధాన్యం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సివిల్‌సప్లయ్ మేనేజరు ఎండీ ఇబ్రహీం, డీసీవో మురళీకృష్ణ, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తవత్సల..గోవిందా..

శాస్త్రోక్తంగా చూర్ణోత్సవం

వైభవంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 8వ రోజు శుక్రవారం వేకువ జామునే స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ పుష్పాలతో అలంకరించారు. మంగళవాయిద్యాలతో శోభాయాత్రగా గౌతమి గోదావరి వద్దకు వెళ్లి వేదమంత్రాలతో గోదారమ్మకు పూజలు నిర్వహించారు. గోదావరి జలాలను తీసుకువచ్చి మహాస్నపనం నిర్వహించారు. లక్ష కుంకుమార్చన, ప్రధాన హోమాలు చేశారు. శ్రీవారు ఉభయ దేవేరులతో అశేష భక్త జనం నడుమ కల్పవృక్షవాహన సేవలో విహరించారు. రంగులు చిమ్మి ఆనందహేళతో చూర్ణోత్సవం నిర్వహించారు. రాత్రి 7.01 గంటలకు కల్కి అలంకరణలో అలంకృతుడైన శ్రీవారు అశ్వవాహనంపై మాడ వీధులలో విహరించారు.



అశ్వవాహనంపై మాడవీధుల్లో విహరిస్తున్న స్వామివారు

బీఈడీ జోష్!

'నవ్విన నాపచేనే పండుతుంది' అనే పెద్దల మాటలు ఊరికే పోలేదు. మొన్నటి వరకు తడబడుతూ మూతపడుతూ వస్తున్న బీఈడీ కళాశాలలకు పూర్వ వైభవం వరించింది. గత ఏడాది 80 శాతం, ఈ ఏడాది వంద శాతం సీట్ల భర్తీతో బీఈడీ కోర్సు ఫుల్ జోష్ మీద ఉంది.



(భీమవరం రూరల్-ఆంధ్రజ్యోతి)

బీఈడీ సీట్లు ఫుల్ అయ్యాయి. అనకొరగా కాదు.. ఏకంగా వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. మెగా డీఎస్సీ ఉపాధ్యాయ ఉద్యోగాల మీద విద్యార్థులకు మరోసారి ఆశ కలిగేలా చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఉన్న 13 బీఈడీ కళాశాలల్లో ఉన్న 850 సీట్లు నిండాయి. 2025 బ్యాచ్‌కి సంబంధించిన మొదటి కౌన్సెలింగ్ సీట్లు ఎలాట్‌మెంట్ గత నెల 22న అయ్యింది. దాదాపుగా సీట్ల భర్తీ అయ్యాయి. మిగిలిన సీట్లు ఈనెల 12వ తేదీన విడుదలైన రెండో కౌన్సెలింగ్‌లో పూర్తిశాతం సీట్లు భర్తీ జరిగాయి. 15 ఏళ్ళ క్రితం ఉన్న బీఈడీ కోర్సుల గిరాకీ ఈ ఏడాది కనిపించింది. 2024 విద్యా సంవత్సరంలోనే 80 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. అప్పట్లో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో మెగా డీఎస్సీ పెట్టడంతో బీఈడీపై విద్యార్థులు మక్కువ చూపడానికి కారణమైంది.

మెగా డీఎస్సీ ప్రభావంతో పూర్వవైభవం

ఉమ్మడి జిల్లాలో 13 కళాశాలల్లో 850 సీట్లు భర్తీ

గతేడాది 80 శాతం..

ఈ ఏడాది నూరుశాతం పూర్తి

డీఎడ్ కళాశాలలు రెండే

బీఈడీ కోర్సుకన్నా మిన్నగా విద్యార్థులు మక్కువ చూపిన డీఎడ్ కోర్సుకు సంబంధించిన డీఎడ్ కళాశాలలు గత ప్రభుత్వ కన్నెర్రతో చతికిలబడ్డాయి. అడ్రస్ లేకుండా పోయాయి. దీంతో 2019లో ఉమ్మడి జిల్లాలో ఉన్న 34 డీఎడ్ కళాశాలల్లో రెండు కళాశాలలే మిగిలాయి. దీంతో డీఎడ్ అందుబాటులో లేని కోర్సుగా మారింది. ప్రస్తుత బీఈడీ జోష్‌ను బట్టి చూస్తే డీఎడ్‌కు అంతకు మించి విద్యార్థులు చేరే అవకాశం ఉంటుంది. మెగా డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలో ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులైన వారిలో చాలామంది డీఎడ్ కోర్సు పూర్తి చేసినవారు ఉన్నారు. 15 ఏళ్ల క్రితం డీఎడ్ సీటు కావాలంటే రూ. 2 లక్షలు పైనే చెల్లించి మరీ సీటు సాధించేవారు. అప్పట్లో డీఎస్సీలో డీఎడ్ చదివినవారు ఎక్కువ పోస్టులు సాధించగలిగారు. దీంతో 2007 నుంచి డీఎడ్ కోర్సు హవా సాగించింది. ఉమ్మడి జిల్లాలో 34 డీఎడ్ కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో 2 వేలు పైగా సీట్లు విద్యార్థులు చేరడానికి వీలుగా ఉండేది. బీఈడీ కోర్సు కన్నా డీఎడ్ బెటర్‌గా అనిపించుకుంది. అలాంటిది ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో దూబచర్లలో ప్రభుత్వ డీఎడ్ కళాశాల , భీమవరం పట్టణంలో సీఎస్ఎన్ డీఎడ్ కళాశాల మాత్రమే ఉన్నాయి. వీటిలో 200 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

డీఎడ్ కాలేజీలు అందుబాటులోకి తేవాలి



ప్రభుత్వ ఉద్యోగాలలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎక్కువ మక్కువ చూపుతారు. వాటి కోసం బీఈడీతో పాటు డీఎడ్ కోర్సు కోర్సులు వచ్చాయి. డీఎడ్ పూర్తి చేసినవారు చాలా మంది ఉపాధ్యాయులు అయ్యారు. ఇప్పుడు డీఎడ్ కళాశాలలు 90 శాతం మూతపడ్డాయి. మళ్లీ అందుబాటులోకి తెస్తే విద్యార్థులకు ఉపయోగపడుతుంది.

- జోహన, డీఎడ్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్

డీఎడ్ చేసి ఉద్యోగం పొందా



మొన్న నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉద్యోగం సాధించాను. 2015 సంవత్సరంలో డీఎడ్ చదివాను. ఆ కోర్సు వల్లనే ప్రభుత్వ ఉపాధ్యాయురాలు అవ్వగలిగాను. డీఎడ్ కళాశాలలను మరిన్ని ఏర్పాటు చేయాలి

- రవళి, మెగా డీఎస్సీ ఉపాధ్యాయురాలు



జిల్లాకు చేరిన ర్యాపిడ్ మొబైల్ టెస్టింగ్ కిట్స్

రేషన్ అక్రమాలకు ఇక చెక్

సీఎస్‌డీటీలకు కిట్లు అందించిన జేసీ

భీమవరం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాను అరికట్టుటలో భాగంగా ప్రభుత్వం జిల్లాకి 45 ర్యాపిడ్ మొబైల్ టెస్టింగ్ కిట్స్‌ను అందించింది. జిల్లాలోని అందరూ పౌర సరఫరాల ఉప తహసీల్దార్లు 20 మందికి జాయింట్ కలెక్టర్ టిరాహుల్ కుమార్ రెడ్డి వీటిని అందించారు. ఈ కిట్స్ ఉపయోగించి ఎవరైనా పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వకానీ, రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత పౌర సరఫరాల ఉప తహశీల్దార్లు వద్ద ఉన్న ర్యాపిడ్ మొబైలు టెస్టింగ్ కిట్ లోని రసాయన ద్రావణాలను బియ్యం పైన చల్లితే బియ్యంలో కలిపిన ఫోర్టిఫైడ్ గుళికలు ఎరుపు రంగులోకి మారుతాయి. అవి పీడీఎస్ బియ్యం అని నిర్ధారణ చేసుకుని అధికారులు కేసు నమోదు చేస్తారు. ఇప్పటివరకూ జిల్లాలోని అన్నీ ప్రాంతాల నుంచి పిడిఎస్ బియ్యం పట్టుకున్న సందర్భంలో వాటి నిర్ధారణ కోసం శాంపిల్స్ తీసి జిల్లా కేంద్రానికి పంపాల్సి వచ్చేది. దీనికోసం రూ.300 రుసుం చెల్లించాల్సి వచ్చేది. దీంతో కొంత వ్యయ ప్రయాసలు పడాల్సి వచ్చేంది. ఇప్పుడు కొత్తగా ర్యాపిడ్ మొబైలు టెస్టింగ్ కిట్స్ రావడంతో క్షేత్రస్థాయిలోనే నిర్ధారణ చేసే వెసులుబాటు కలిగింది. మిగిలిన 25 కిట్లు టెక్నికల్ అసిస్టెంట్‌లకు అందించనున్నారు.

దీపం, ఉజ్వల కనెక్షన్‌లకు దరఖాస్తు చేసుకోండి

జిల్లాలో దీపం, ఉజ్వల పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు కొత్తగా గ్యాస్ కనెక్షన్లు మంజూరుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. అందులో భాగంగా అర్హులైన లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలలో నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించింది. అంతేకాకుండా దీపం, ఉజ్వల యోజన పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్ని ఆయిల్ కంపెనీల గ్యాస్ సేల్స్ ఆఫీసర్లు జిల్లా పౌరసరఫరాల అధికారితో కమిటీని ఏర్పాటు చేశారు. అర్హులైన లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి దీపం, ఉజ్వల పథకాల కింద కొత్త గ్యాస్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆయుష్.. తగ్గుతోంది!



తగిన సిబ్బంది లేక సతమతమవుతున్న ఆసుపత్రులు

మందులు లేవు.. వైద్యులు లేరు

ఏళ్లు గడుస్తున్నా భర్తీకాని పోస్టులు



ఆకివీడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతిలో లభ్యమయ్యే సహజ సిద్ధ ప్రాకృతిక వనాలతో రోగాలను నయం చేయగలిగే ఆయుర్వేద వైద్యం అందించే ఆయుష్ ఆసుపత్రులు తగిన సిబ్బంది లేక సతమమతమవుతున్నాయి. ఒకవైపు వైద్యుల కొరత మరోవైపు అధికారుల పర్యవేక్షణ కొరవరడంతో ఆయుష్ ఆసుపత్రులు ఆదరణకు నోచుకోవడం లేదు. ఏళ్ళ తరబడి వైద్యుల నియామకాలు లేవు. అసలు ఆయుర్వేద ఆసుపత్రులు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది.

అరకొరగా వైద్య సేవలు

ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియో వైద్యాలను నేడు ఆయుష్‌గా పిలుస్తున్నారు. ఆయుర్వేదంలో ప్రస్తుత రోజుల్లో ప్రతీ ఒక్కరినీ పట్టి పీడిస్తున్న కీళ్ళవాతానికి చక్కటి మందులు లభ్యమవుతాయి.విష జ్వరాలు, కామెర్లు, కఫం, దగ్గు, ఫైల్స్ వ్యాధులకు చక్కటి మందులు ఈ వైద్యంలో ఉన్నాయి. బలహీనత, రక్తహీనతకు ఈ మందులు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇంతటి ప్రాధాన్యత కల్గిన ఆసుపత్రులు ఉమ్మడి జిల్లాలో అరకొరగా కొనసాగుతున్నాయి. ఆయుష్ వైద్యశాలల్లో గత రెండేళ్లుగా వైద్యులు లేరు. మందులు లేవు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆయుష్ వైద్య శాలలు ఆయుర్వేదానికి సంబంధించి 31 ఆసుపత్రులు ఉండగా, హోమియో 13, యునాని 5, నేచురోపతి 5 ఆసుపత్రులు ఉన్నాయి. ఆయుర్వేదం, హోమియో, యునానికి సంబంధించి డాక్టర్లు, సిబ్బంది అరకొర ఉన్నారు. యునానికి రెండేళ్ల పైబడి మందులు లేవు. ఆయుర్వేదం, హోమియోకి మందులున్నాయి కాని వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. సౌకర్యాలు లేవు, ఆసుపత్రులలో ఉన్న వైద్యులు, సిబ్బందికి జీతాల్లేవు. నేషనల్ ఆయుష్ మిషన్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టులో ప్రకటించిన ప్రకారం 358 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. మూడు నెలలు దాటినా నోటిఫికేషన్ విడుదల కాలేదు.ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన మార్గదర్శకాల కోసం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ఏర్పాటై నెలరోజులైనా ఫైలు ఇంకా ప్రభుత్వానికి పంపకపోవడం బాధాకరమని వాపోతున్నారు.

వైద్య సేవలు కొనసాగించాలి



ఎంతో విలువైన ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలకు అందించాలి. అందుబాటలోకి తీసుకురావాలి. ఆకివీడులో ఆసుపత్రి ఉన్నా వైద్యులు, మందులు ఉండవు. ఇప్పుడు వైద్యుడు ఉన్నా మందులు లేవు. ప్రభుత్వం ఆయుష్ ఆసుపత్రులపై దృష్టి సారించి ప్రజలకు అందుబాటలోకి తీసుకురావాలి.

- బొబ్బిలి బంగారయ్య, వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఆకివీడు

సేవలను విస్తృత పరుస్తున్నాం



రోగికి శాశ్వత వ్యాధి పరిష్కారాన్ని అందించే ఆయుర్వేదం వంటి విలువైన వైద్యసేవలను విస్తృతపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. ప్రజల్లో ఈ వైద్యం పట్ల అవగాహన పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నది. ప్రజలకు సేవలు అందేలా చర్యలు చేపడుతుంది.

- అశోక్, వైద్యుడు, ఆకివీడు

మార్కెట్‌లో దీపావళి కాంతులు 8

అమ్మకానికి రంగు రంగుల ప్రమిదలు



ఏఐ పరిజ్ఞానంతో కోళ్ల మరణాలకు చెక్ 9

ఆటిజం పిల్లల కోసం ప్రత్యేక సెంటర్లు

జిల్లాలో 6 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

రూ.కోటీ 66 లక్షలు నిధులు విడుదల



భీమవరం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆటిజం ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్రశిక్ష ద్వారా జిల్లాలో 6 సెంటర్లను ఏర్పాటు చెయ్యనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సెంటర్లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో జిల్లాకు సంబంధించి ప్రతిపాదనలు కోరటంతో సమగ్రశిక్ష అధికారులు సెంటర్లను ప్రతిపాదించి ఆమోదం కోసం పంపించారు. సెంటర్ల ఏర్పాటు, నిర్వహణ కోసం ఒక్కొ సెంటర్‌కు రూ.27.25 లక్షలు మంజూరు చేసింది. మొత్తం 6 సెంటర్లకు రూ.1.66 కోట్లు మంజూరయ్యాయి. వయసుకు తగ్గ మానసికపరమైన ఎదుగుదల లేకపోవడం, ఆలస్యంగా మాట్లాడటం, చీకటిలో ఉండేందుకు ఇష్టపడటం, ఎదుటి వారితో కళ్లలోకి చూసి మాట్లాడకపోవటం, అందరితో ఉల్లాసంగా ఉండకుండా ఒంటరిగా కూర్చోవడం తదితర లక్షణాల ఆధారంగా గుర్తిస్తారు. భవిత కేంద్రాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదుకునే ఇటువంటివారిని గుర్తించి వారికి ప్రత్యేకంగా ఏర్పాటుచేసే ఆటిజం సెంటర్లలో శిక్షణ ఇస్తారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించనున్నారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో ప్రయోగత్మకంగా సెంటర్ ఏర్పాటు చేశారు.అక్కడ వచ్చిన ఫలితాల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా సెంటర్లను ఏర్పాటు చెయ్యనున్నారు.

సెంటర్లు ఇవే

భీమవరంలో జేఎల్‌బీ ఉన్నత పాఠశాలను ఎంపిక చేశారు. ఐతే ఈ పాఠశాలల్లో గదులు ఖాళీలు లేకపోవటంతో వేరే ప్రాంతంలో ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నారు. పాలకొల్లులో బీఆర్ఎంవీ మునిసిపల్ ఉన్నతపాఠశాల, తణుకు జిల్లాపరిషత్ పాఠశాల (బాలురు), తాడేపల్లిగూడెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆకివీడు జడ్పీహెచ్ పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వేల్పూరులో సెంటర్ ఏర్పాటు చెయ్యవలసి ఉండగా అక్కడ స్థలం లేకపోవడంతో దొడ్డిపట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం రావలిసి ఉంది.



యువజనోత్సవంలో ఆకట్టుకున్న విద్యార్థినుల పల్లె నృత్యం

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

యువజనోత్సవాల ప్రారంభ సభలో ఎమ్మెల్యే ఆరిమిల్లి

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



యువజనోత్సవాల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ నేటి యువత చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. పోటీలు విద్యార్థులలో శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పాటునిస్తాయని వివరించారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో నూతన పరిశ్రమలు, టెక్నాలజీని అభివృద్ధి చేసే ఐటీ పరిశ్రమలు పెట్టుబడులు పెడుతున్నారని, దీని ద్వారా యువతకు రానున్న ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారని వివరించారు. ఇపుడు గుగూల్ డేటా సెంటర్ కూడా వైజాగ్ రావడంలో సీఎం చంద్రబాబు కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. సెట్‌వెల్ ముఖ్యకార్యనిర్వహణాధికారి కేఎస్.ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు అందించే అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. జీవితంలో కెరీర్ పరంగా ఉన్నత స్థాయిలో ఉండాలని సూచించారు. పోటీలలో తణుకు, తాడేపల్లిగూడెం, గణపవరం, పాలకొల్లు, భీమవరం, నరసాపురం నుంచి వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ చిట్టూరి సత్య ఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, ప్రిన్సిపాల్ యు. లక్ష్మీసుందరీబాయి, వావిలాల సరళాదేవి, కొండేటి శివ, కొమ్మిరెడ్డి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

దీపావళి దివ్వెలు

మార్కెట్‌లో అందమైన ప్రమిదలు.. ధర ఎక్కువే!









ఏలూరు సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి అంటేనే దీపాల వెలుగులు. దీపావళి అమావాస్య వేళ రాత్రి సమయంలో దీపాలను వెలిగించి, బాణసంచా కాలుస్తారు. వెలుగులు చిందే దీపం కూడా అందంగా తీర్చిదిద్ది మార్కెట్‌లో అమ్మకానికి ఉంచారు. వివిధ రంగులలో ఆకారాలలో విశేషంగా ఆకర్షిస్తున్నాయి. దీపావళి పండుగ రోజు అలంకరణ, వెలుగులు చిందే దీపాలకు ప్రత్యేక ప్రాశస్త్యం కూడా ఉంది. ప్రమిద వెలుగు నవగ్రహ దోషాలను పోగొడుతుందని పంచాంగకర్తలు చెబుతారు. దీపావళి వస్తోందంటేనే ప్రమిదలకు ఏటా గిరాకీ పెరుగుతుంది.

ప్రమిదలు.. రంగుల కుండలు

ప్రస్తుతం మార్కెట్‌లో ప్రమిదల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ ఆకృతుల లో మట్టి ప్రమిదలు రంగులతో పాటు చిన్నపిల్లలు దీపావళి పూజకు వినియోగించే చిన్ని చిన్ని కుండలను రంగులతో తీర్చిదిద్ది విక్రయిస్తున్నారు. వివిధ రకాల ఆకృతులతో దీపాలు వెలిగించే వివిధ రకాల దేవుళ్ల ఆకృతులను కూడా తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు.

దుకాణాల వద్ద సందడే సందడి

ప్రమిదల దుకాణాలు సందడిగా ఉన్నాయి. ఏలూరుతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రమిదల వ్యాపారం జోరుగా సాగుతోంది. గత ఏడాదితో పోలిస్తే ధరలు విపరీతంగా పెరిగాయని చెబుతున్నారు. డజను రూ.30 నుంచి రూ.120 వరకు, వివిధ ఆకృతులలో ప్రత్యేక దీపాలు రూ.వెయ్యి ధరకు విక్రయిస్తున్నారు. గంటలు ఆకృతులలో ప్రమిదలు, వివిధ రకాల బొమ్మలు, గుడి ఆకారంలో ప్రమిదలు, వినాయక మండ పాలు, నెమలి సింహాసనం, తామరాకు, పద్మం, శివాకారం, లాంతరు ఆకారంలో ప్రమిదలు, పద్మంలో కుండను పెట్టి చుట్టూ దీపాలు పెట్టుకునే విధంగా ఏర్పాటు చేసిన ప్రమిదలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఆకాశ దీపాలు రూ.150 నుంచి రూ.600 ధరకు అమ్మకాలు చేస్తున్నారు. రంగు ల కుండ ఒక్కొక్కటి రూ.30, బొమ్మలు ధర రూ. 150 నుంచి రూ. 3 వేలకు విక్రయిస్తున్నారు.



బాణసంచా.. జాగ్రత్తలు



పోలవరం అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళికి కొత్తబట్టలు, నోరూరించే పిండి వంటలు, లక్ష్మీదేవి పూజ ఒక ఎత్తు.. టపాసుల మోత మరో ఎత్తు. బాణసంచా సరదా నింపాలంటే జాగ్రత్తగా ఉండాలి. టపాసులు కాల్చే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవడం తప్పని సరి.

- టపాసులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులను ధరించడం మంచిది.
- చేతులు, ముఖాన్ని కాలుతున్న టపాసులకు దూరంగా ఉంచి జాగ్రత్తగా అంటించాలి.
- చిన్నారులు టపాసులు కాల్చే సందర్భాలలో పెద్దల పర్యవేక్షణ ఉండాలి.
- టపాసులు బహిరంగ ప్రదేశాలలోనే కాల్చాలి. కరెంటు తీగలు, గడ్డిమేట్లు, పూరి గుడెసెలు ఉన్న ప్రాంతాలలో టపాసులు కాల్చరాదు. మంటలు వ్యాపించడానికి ఆస్కారం లేని నిర్జన ప్రాంతంలో టపాసులు కాల్చాలి.
- పేలకుండా ఉండిపోయిన టపాసుల దగ్గరకు వెళ్లడం తాకడం చేయకూడదు. ముందు వాటిపై నీటిని పోసి ఆర్పాలి.
- శానిటైజర్ లాంటి మండే పదార్థాలు రాసుకుని టపాసులు కాల్చొద్దు.
- వాడిన టపాసులు ఇసుక బకెట్‌లో వేయాలి.
- టపాసులు కాల్చే సమయంలో ముందు జాగ్రత్తగా బక్కెట్‌తో నీటిని సిద్ధంగా ఉంచుకోవాలి.
- అత్యవసరమైతే ఫైర్ స్టేషన్‌కి కాల్ చేయడానికి నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచా యతీ సెక్రటరీ శ్రీరా మ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సంద ర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుం బంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహిం చని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తు న్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మా న్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడి యోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధా లను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహిం చిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటా ధర' కూడా వంద శాతం హిట్ కొడు తుంది. నవంబరు 7న కుటుంబ సభ్యు లందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లా డుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధ ర'తో తెలుగులో నటించడం చాలా ఆనం దంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైట ర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకు రాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోష నల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞ తలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజ యవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞ తలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్ర మాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మా తలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథాను సారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మ కంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథా, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.



ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకార ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

నేడు పాలకొల్లు ఏఎంసీ ప్రమాణ స్వీకారం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ఉదయం జరగనుంది. స్థానిక ఏఎంసీ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు కె.అచ్చెన్నాయుడు, డాక్టర్ నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్లను మంత్రి నిమ్మల శుక్రవారం పరిశీలించారు. శనివారం ఉదయం మంత్రి నిమ్మల కార్యాలయం నుంచి భారీ ఊరేగింపుగా బయలుదేరి పూలపల్లి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం ఏఎంసీలో ప్రమాణ స్వీకారం అనంతరం భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, పీతల శ్రీను, పాముల రజనీ, ఎం.పెద్దిరాజు తదితరులు మంత్రితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఏఎంసీ చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత కోడి విజయభాస్కర్, డైరెక్టర్లుగా దాసరి రత్నంరాజు, కలిదిండి రామచంద్రరాజు, బిట్ట లక్ష్మీనారాయణ, జడ్డు లక్ష్మీ తులసి అమ్మాజీ, సానబోయిన శ్రీనివాసరావు, రాయి శ్రీనివాస్, నీలం నారాయణ మూర్తి(తాతాజీ), కొప్పిశెట్టి జ్వాలా, గుబ్బల లక్ష్మి, వాసా భ్రమరాంబ, కొక్కిర మెట్ల అమ్మాజీ, గరికిపాటి రాజేశ్వరి, కారువల్లి వెంకటలక్ష్మీ కనకదుర్గ, పెన్మెత్స సత్యనారాయణరాజు, ఎస్.విజయకుమారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఆక్వా దోహదం



డైరెక్టర్ డా. ఐ.వి.నారాయణను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

తణుకు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగం రాష్ట్రంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారమని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం కామర్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్. ఉదయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం ఎస్సీ ఐఎం డిగ్రీ కాలేజీలో రెండో రోజు ఆక్వా ఎంటర్ ప్రెన్యూర్ షిప్-వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయని తెలిపారు. పీలేరు ఎస్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆచార్యులు డా. ఎం.వెంకట రమణయ్య, విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆచార్యులు డా. ఒ.అచ్యుతరామకిషోర్, ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ ఎం.జగన్మోహన్, డా.ఎం.హరీష్, రావులపాలెం డిగ్రీ కాలేజి అధ్యాపకులు డా. బి.పి.నరసారెడ్డి, సదస్సు కో ఆర్డినేటర్ డా.ఐ.వి.నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలు ప్రసంగించారు.

మొగల్తూరు ఆస్పత్రి తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి

మొగల్తూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏడాదికి విధిగా పది సుఖ ప్రసవాలు అయ్యేలా చూడాలని జిల్లా వైద్యాధికారిణి గీతాబాయి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే శీతాకాలంలో సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

న్యాయ సేవాధికార సంస్థ పథకాలపై అవగాహన ర్యాలీ

భీమవరం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన అసంఘటిత కార్మికుల పథకం, బాలల హక్కుల పరిరక్షణ పథకాలపై వివిధ శాఖల సమన్వయంతో ఈ నెల 18న ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించబోయే న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీస్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించుటకు శుక్రవారం చిన అమిరంలో 2కే ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి, సంస్థ చైర్మన్ డాక్టర్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పథకాలపై అవగాహన కోసం శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అన్ని శాఖల స్టాల్స్ ఉంటాయని తెలిపారు. ర్యాలీలో న్యాయమూర్తులు ఎం.సుధారాణి, జి.సురేష్‌బాబు, పి.హనీష, ఎస్.జ్యోతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై.యోహాను (న్యూటన్), జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బీఎస్ఎన్ రెడ్డి, ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రనాథ్

నూతన కార్మిక విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

తాడేపల్లిగూడెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నూతన కార్మిక విధానాన్ని కార్మిక వర్గం పూర్తిగా వ్యతిరేకిస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ రెండు రోజుల సమావేశాలు శుక్రవారం తాడేపల్లిగూడెంలో ప్రారంభమయ్యాయి. భవన నిర్మాణ కార్మిక సంఘం వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని సీనియర్ నాయకుడు నెక్కంటి సుబ్బారావు ఎగురవేశారు. పూడి సుబ్బారావు ప్రాంగణంలో సమావేశాలు ప్రారంభమయ్యాయి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ నూతన కార్మిక విధానం కార్మికుహక్కులకు గొడ్డలి పెట్టని అభివర్ణించారు. కార్మికులు ఎంతో పోరాడి సాధించుకున్న 49 కార్మిక చట్టాలను కేంద్రం కాలరాస్తోందని ఆరోపించారు. నూతన కార్మిక విధానం వల్ల కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేలా ఉందన్నారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయడం దారుణమన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మిక లోకం గొంతుకోసే విధంగా ఉందన్నారు. ఏఐటీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకటరామరావు, రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్, దూసనపూడి సోమసుందర్ తదితరులు పాలొన్నారు.

లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

నరసాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా విక్రయించే వ్యాపారులు కనీసం తాత్కాలిక లైసెన్స్ తీసుకున్న తరువాతే షాపులు ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని ఆర్డీవో దాసిరాజు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పార్కు రోడ్‌లో తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ప్రతి షాపు వద్ద విధిగా ఇసుక, నీళ్ళ బకెట్లు ఉండాలన్నారు. దుకాణాల వద్ద నో స్మోకింగ్ బోర్డులు పెట్టాలన్నారు. విధిగా సీసీ కెమెరాలు ఉండాలన్నారు. రెవెన్యూ, ఫైర్, పోలీసులు తనిఖీలు చేయాలన్నారు. బాల కార్మికులతో అమ్మకాలు జరపరాదన్నారు. ఆయన వెంట కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ ఐవివి సత్యనారాయణ, సీఐ యాదగిరి, ఫైర్ అధికారి భాస్కర్ రామం, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు రుణ మంజూరు పత్రాలు పంపిణీ



రుణ మంజూరు పత్రాలు అందిస్తున్న లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్

భీమవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):పీఎం స్వ నిధిపై మెప్మా, లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం భీమవరం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లాలో అన్ని మునిసిపాలిటీల పరిధిలో అర్హులైన స్ట్రీట్ వెండార్స్‌కి రుణాలు మంజూరు చేసి పత్రాలను అందజేశారు. సుమారు 100 మంది వీధి వ్యాపారులు హాజరవ్వగా 70 మందికి రూ.18 లక్షలు రుణాల మంజూరు పత్రా లను అందజేశారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు నాగేంద్రప్రసాద్, యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ వెంకన్నబాబు, మెప్మా పీడీ హెప్సిబా పాల్గొన్నారు.



ఉండి మత్స్య పరిశోధన కేంద్రంలో రెండో రోజు శిక్షణ ఇస్తున్న వెంకట్రామన్నగూడెం శాస్త్రవేత్తలు దేవిప్రసాద్‌రెడ్డి, ప్రభంజనకుమార్‌రెడ్డి, మేతను పరిశీలిస్తున్న విద్యార్థులు

రొయ్యల సాగులో మేత కీలకం

శాస్త్రవేత్తల సూచనలు

ఉండి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రొయ్యల సాగులో మేత కీలకమని, వాటి ఉపయోగాలను ప్రతీ ఆక్వా రైతు, విద్యార్థులు అవగాహన చేసుకోవాలని శాస్త్రవేత్త ప్రభంజనకుమార్‌రెడ్డి అన్నారు. ఉండి మత్స్య పరిశోధన కేంద్రంలో ఎన్ఎఫ్‌డీబీ ఆర్థిక సహాయంతో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. రొయ్యల మేత తయారీ, యాజమాన్య పద్ధతులు క్లుప్తంగా వివరించారు. రొయ్యలసాగు చేయడం ఎంతో కష్టమని, క్రమ పద్ధతిలో సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలన్నారు.

ప్రయోగాత్మకంగా మేత తయారీ

రొయ్యల మేత పదార్థాలు, తయారీ విధానంపై శాస్త్రవేత్త దేవీప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు ప్రయోగాత్మకం గా వివరించారు. రొయ్యల మేత తయారీలో యాంటిబయోటిక్ ప్రత్యామ్నాయ అనుబంధ పదార్థాలను విద్యార్థులకు వివరించారు. మత్స్యపరిశోధన కేంద్రంలోని లేబొరేటరీని విద్యార్థులు పరిశీలించారు. కార్యక్రమంలో మత్స్య పరిశోధన కేంద్రం హెడ్ చంద్రశేఖర్‌రావు, శివకుమార్, భీమేశ్వరరావు, షష్టి రిష, ధీరజ్, నిశ్చల్, రాజగోపాల్ తదితరులతో పాటు భీమవరం కేజీఆర్ఎల్ కళాశాల లెక్చరర్స్ జాహ్నవి, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ఎంతో ఉపయోగం



మత్స్యపరిశోధన కేంద్రంలో శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగం. శాస్త్రవేత్తల సూచనలు అవగాహన కార్యక్రమాలను తెలుసుకుంటున్నాం. తరగతిలో బోధనతోపాటు క్షేత్రస్థాయిలో రొయ్యల సాగు, మేతల విధానం, పద్ధతులు వంటివి తెలుసుకుంటున్నాం.

\- రాజ్యలక్ష్మి, బీఎస్సీ ఫిషరీస్

రొయ్యల సాగు అర్థమైంది



రొయ్యల సాగు పద్ధతులు, విధానాలు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. మత్స్య పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు ఆక్వా విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం శాస్త్రవేత్తలు అందించిన సూచనలు సలహాలు ఎంతో విలువైనవి.

\- గణేశ్, బీఎస్సీ ఫిషరీస్

ఏఐ పరిజ్ఞానంతో కోళ్ల మరణాలకు చెక్

ప్రపంచ స్థాయి పోటీల్లో శృంగవృక్షం యువకుడి ప్రాజెక్ట్‌కు తృతీయ స్థానం



ప్రపంచ వేదికపై మధులాష్‌బాబు విజయ దరహాసం

పాలకోడేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):శృంగవృక్షం గ్రామానికి చెందిన యువకుడు నూతన సాంకేతిక ఆవిష్కరణతో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందాడు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఆహార, వ్యవసాయ సంస్థ ఈ నెల 16న రోమ్‌లో ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో క్రొవ్విడి మధులాష్‌బాబు తృతీయ స్థానం సాధించి భారతదేశ పతాకం రెపరెపలాడించాడు. ఆహార విభాగం లో రైతులకు ఉపయోగపడే రీతిలో ఏఐ సాంకేతికతను ఉపయోగించి కోళ్ల మరణాలను అరికట్టే ప్రాజెక్ట్ రూపొందించాడు. జాతీయ స్థాయిలో ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి రోమ్‌లో జరిగే ప్రపంచస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అక్కడ ప్రపంచవ్యాప్తంగా 150 మందితో పోటీపడిన అతడి ప్రాజెక్ట్ ప్రపంచలో తృతీయ స్థానంలో నిలిచింది. ఎలక్ట్రానిక్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన మధులాష్‌బాబు హైదరాబాద్‌లో 'ఎడోధ్వజ' అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ద్వారా తెలంగాణలో 40 వేల మంది విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం, ప్రయోగాలను వినియోగించుకోవడంపై అవగాహన కల్పించాడు. తాజాగా నూతన ఏఐ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కోళ్ల మరణాలు అరికట్టే ప్రాజెక్ట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. మధులాష్ బాబు ప్రతిభతో మారుమూల గ్రామం శృంగవృక్షం ప్రపంచ పటంపై మెరిసిందని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పీఎంపీ, ఆర్ఎంపీల ఉమ్మడి జిల్లా సమావేశం

భీమడోలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):పీఎంపీ, ఆర్ఎంపీల ఆత్మీయ సమావేశం శనివారం తాడేపల్లిగూడెంలో జరుగుతుందని, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని సభ్యులంతా విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా జేఏసీ కోకన్వీనర్ ఎం సాయిరామ్ శుక్రవారం తెలిపారు. 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, గ్రామీణ వైద్యుల పాత్ర' అంశంపై సమావేశం నిర్వహిస్తున్నామని, రాష్ట్ర కమిటీతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఇంకూలు నాగేశ్వరరావు కన్వెన్షన్ హాలులో సమావేశం జరుగుతుందన్నారు.

3 నుంచి మునిసిపల్ కార్మికుల సమ్మె

ఏలూరు టూటౌన్/ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):దీర్ఘకాలంగా మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భజంత్రి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మహాత్మా గాంధీ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఉద్యమం చేస్తున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోలేదని, వచ్చే నెల 3 నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు సమాయత్తమవుతున్నట్లు తెలిపారు. అప్పలరాజు, బండి వెంకటేశ్వర రావు, కిశోర్, కన్నబాబు, హేమశంకర్ పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో యువకుడికి ఏడేళ్ల జైలు

ఏలూరు క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్నేహితుని భార్యను బెదిరించి అత్యాచారం చేసినట్లు ఒక యువకునిపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏలూరులోని ఐదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ శుక్రవారం తీర్పు చెప్పారు. కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక దంపతుల ఇంటికి దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామానికి చెందిన మాండ్రు వెంకట ఆనంద్ (26) తరచుగా వస్తూ భర్తతో స్నేహం పెంచుకున్నాడు. భర్తలేని సమయంలో తరచుగా వచ్చేవాడు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2021 జూన్ 12వ తేదీన మాండ్రు వెంకట ఆనంద్ ఆ ఇంటికి రాగా ఆ వివాహిత, వారి పిల్లలు మాత్రమే ఇంట్లో ఉన్నారు. తన కోరిక తీర్చకపోతే పిల్లలను చంపేస్తానని, ఆమెను కూడా చంపివేస్తానని బెదిరించి, బలవంతంగా అత్యాచారం చేశాడు. అదే సమయంలో ఆ పిల్లల నానమ్మ వచ్చి అతడి జుట్టుపట్టుకుని కొట్టడంతో అక్కడ నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై కొయ్యలగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని ఐదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతమనేని రమేష్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు పోలవరం డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు, పోలవరం సీఐ బాలసురేష్‌బాబు, కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, హెచ్‌సీ కేఎస్ఎన్ మూర్తి, ఏఎస్ఐలు సిసిలి, రుక్మందనరావు, కోర్టు మహిళా కానిస్టేబుల్ హేమలత సకాలంలో సాక్ష్యులను కోర్టుకు హాజరుపరిచి ప్రాసిక్యూషన్‌కు సహకరించారు. ఈ కేసులో నిందితుడైన మాండ్రు వెంకట ఆనంద్‌పై నేరం రుజువు కావడంతో ఏడేళ్ళ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో మరో నెల రోజుల పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష విధించేలా ప్రాసిక్యూషన్‌కు సహకరించి తమ ప్రతిభను కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ కిశోర్ అభినందించారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి



ప్రభాకరరావు (ఫైల్)

భీమడోలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన భీమడోలులో శుక్రవారం జరిగింది. భీమడోలు గ్రామంలో ఉంటున్న బసవ ప్రభాకరరావు(70) ఈనెల 15న ఇంటినుంచి వెళ్లి కనిపించలేదు. శుక్రవారం ఉదయం భీమడోలు శివాలయం పక్కనే ఉన్న చెరువులో మృతదేహం ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రభాకరరావుగా గుర్తించారు. రైల్వే స్టేషన్ మాస్టర్‌గా పనిచేసి రిటైర్ కావడంతో ఇంట్లోనే ఉంటున్నారు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మరిగే సాంబారులో పడి వ్యక్తి మృతి

కాకినాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ప్రమాదవశాత్తు మరిగే సాంబారులో పడి తీవ్ర గాయాలపాలైన ఓ వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాలివి.. భీమవరం అంబేడ్కర్ కాలనీకి చెందిన కటికల సునీల్‌కుమార్ (27) ఈ నెల 12న అదే ప్రాంతంలో ఓ వివాహ వేడుకకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు మరిగే సాంబారు దబరా గిన్నెలో పడిపోయాడు. తీవ్రగాయాలపాలైన అతడిని స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి, కాకినాడ జీజీహెచ్‌కు సిఫారసు చేశారు. అక్కడ నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతడికి భార్య నీలిమ, ఒక కుమారుడు ఉన్నారు. భీమవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.జయబాబు శుక్రవారం తెలిపారు. మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన జాలా వెంకటేశ్వరరావు ఈనెల 15న భార్య, పిల్లలతో కలిసి భద్రాద్రికొత్తగూడెం జిల్లా అచ్యుతాపురం గ్రామానికి వెళ్లి.. తిరిగి ఈ నెల 17న ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులకొట్టి ఉంది. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి గుర్తుతెలియని దొంగలు అరకాసు బంగారు చెవిపోగులు, జత వెండి పట్టీలు, రూ.5వేలు నగదు అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళ బ్యాగ్‌లో బంగారం చోరీ

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న మహిళ బ్యాగ్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు వస్తువులను దొంగిలించారు. స్టేషన్ రైటర్ పి.బాబూరావు తెలిపిన వివరాలివి. ఇరగవరానికి చెందిన మంకు నాగలక్ష్మి తన కుటుంబంతో కలిసి శుక్రవారం పట్టణంలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ గ్రామానికి వెళ్లేందుకు జంగారెడ్డిగూడెం బస్టాండుకు వచ్చి తాడేపల్లిగూడెం బస్సు ఎక్కారు. ఆధార్ కార్డు కోసం బ్యాగ్ తెరచి చూడగా అందులోని 78 గ్రాముల బంగారు నెక్లెస్, నల్ల పూసలతాడు కనిపించలేదు. బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయని గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైటర్ తెలిపారు.



ఏలూరు, జీలుగుమిల్లిల్లో స్వాధీనం చేసుకున్న బాణసంచా సామగ్రి

బాణసంచా అక్రమ తయారీ కేంద్రంపై దాడి.. ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా జనవాసాల మధ్య అక్రమంగా బాణసంచా తయారీ చేస్తున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు వారి సిబ్బంది శుక్రవారం ఆ ఇంటిపై దాడి చేసి బాణసంచా సామగ్రిని సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఏలూరు సమీపంలోని సత్రంపాడులో కాసా గణేష్ వీరభద్రరావు, కాసా ప్రేమ సుందరరావు కలిసి భారీ ఎత్తున బాణసంచా సామగ్రి పౌడర్లను నిల్వలు పెట్టి, తారాజువ్వలు, ఉల్లిపాయలు, నార బాంబులు ఇతర సామగ్రి తయారు చేస్తున్నారు. త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు పి.రాంబాబు, పి.అప్పారావు వారి సిబ్బంది కలిసి ఆ ఇంటిపై దాడి చేసి 12 బస్తాల బానసంచా సామగ్రి సీజ్ చేసి, వారిద్దరిని అరెస్టు చేశారు.

దర్భగూడెంలో ఒకరు..

జీలుగుమిల్లి : దర్భగూడెంలో అక్రమ బాణసంచా నిల్వలపై ఎస్ఐ వి.క్రాంతికుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కంచర్ల సుబ్బారావు వద్ద బాణసంచా నిల్వలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. కానిస్టేబుల్ లక్ష్మణ్ ఉన్నారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న గుత్తా వెంకటేశ్వరరావు

తమ్మిలేరు వాగుపై హైలెవెల్ కాజ్‌వే నిర్మించాలి

చింతలపూడి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శివపురం-చిన్నంపేట మధ్య తమ్మిలేరు వాగుపై హైలెవెల్ వంతెన నిర్మాణం మంజూరు చేయాలని కోరుతూ తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. వంతెన నిర్మాణంతో పలు మండలాల మధ్య దూరం తగ్గుతుందని, వెనుకబడిన గ్రామాల అభివృద్ధి, వరద సమయంలో రవాణా సౌకర్యానికి భరోసా ఉంటుందన్నారు. శివపురం నుంచి రాఘవాపురం తారు రోడ్డు సౌకర్యం, ఇళ్ల స్థలాల సమస్యలపై ఎమ్మెల్యే, ఎంపీ సిఫారసు పత్రాలను అందజేసినట్టు తెలిపారు.

పోలవరం నిర్వాసితులకు రూ.1100 కోట్లు విడుదల

ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్

ఏలూరు టూటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):పోలవరం నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లు విడుదల చేసిందని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే నిర్వాసితులకు నష్టపరిహారం అందుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఫలితంగా కేంద్రం ఈ సొమ్ము విడుదల చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఇంకా నష్టపరిహారం అందని వారు బిల్లులను ప్రభుత్వానికి సమర్పించాలన్నారు.

పోలవరం భూసేకరణ స్పెషల్ కలెక్టర్ సరళా వందనం బదిలీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలోని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు(పీఐపీ) భూసేకరణ స్పెషల్ కలెక్టర్ ఎస్‌జీడీసీ సత్తెనపల్లి సరళావందనం బదిలీ అయ్యారు. ఆమెకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీకి నేరుగా రిపోర్టు చేయాలని సీఎస్ కె.విజయానంద్ ఆదేశించారు. ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు.



ఏలూరులో శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్

భద్రతా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఏలూరుక్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):విద్యార్థినులు చదువులో రాణించడానికి క్రమశిక్షణ ఎంత ముఖ్యమో.. భద్రత చట్టాలపై అవగాహన పెంచుకోవడం అంతే ముఖ్యమని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు సూచించారు. ఏలూరు ఎన్ఆర్ఐ కాలేజీ విద్యార్థినులకు శక్తి యాప్‌పై ఒక రోజు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ విద్యార్థినులు ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే 112కు కాల్ చేయాలని పది నిమిషాల్లోపే పోలీసులు అక్కడకు చేరుకుంటారన్నారు. మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ శక్తి యాప్‌ను అభివృద్ధి చేసిందని ప్రతి ఒక్కరూ తమ ఆండ్రాయిడ్ మొబైల్‌లో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పోలీస్ సహాయం పొందవచ్చన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగమణి, కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లకు ఎస్పీ అభినందన

ఏలూరు క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లు నిడదవోలుకు చెందిన జి.వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెంకు చెందిన పి.విజయ్‌కుమార్‌లను ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. సీనియార్టీని బట్టి వీరికి పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు.


పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎస్పీ కిశోర్ హామీ ఇచ్చారు. మూడో శుక్రవారం జిల్లా కార్యాలయంలో పోలీస్ సిబ్బంది సంక్షేమ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి హామీ ఇచ్చారు.

వేర్వేరు చోట్ల పదకొండు మంది జూదరుల అరెస్ట్

పెదవేగి/పెదపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో వేర్వేరు చోట్ల మొత్తం పదకొండు మంది జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. పెదవేగిలో శుక్రవారం పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.34 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ సీహెచ్.రాజశేఖర్ తెలిపారు. పెదపాడు మండలం అప్పనవీడు పంచాయతీ పరిధిలోని తాళ్లమూడిలో పేకాడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశామని ఎస్ఐ కట్టా శారదాసతీష్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.36,950 నగదు, రెండు సెల్‌ఫోన్లు, నాలుగు మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 112కి లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

రహదారిపై గుంతలో దిగబడిన ఆర్టీసీ బస్సు



దిగబడిన ఆర్టీసీ బస్సు

చాట్రాయి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చాట్రాయి వికాస్ స్కూల్ వద్ద ఉన్న భారీ గుంతలో శుక్రవారం ఆర్టీసీ బస్సు దిగబడింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బస్సు బయటకు రాకపోవడంతో ట్రాక్టర్‌తో బస్సును బయటకు లాగారు. పది రోజులుగా ఇక్కడ లోడు ట్రాక్టర్లు, ఆటోలు, చిన్న కార్లు దిగబడిపోతుండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వేడుకగా ముత్యాలమ్మ జాతర

ఆచంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ఆచంట గ్రామదేవత ముత్యాలమ్మ, గోగులమ్మ జాతర వేడుకగా నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి అమ్మవారి జాతర కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా గరగనృత్యాలు, తీన్‌మార్‌డప్పులు, సన్నాయి మేళాలు, బాణసంచా కాల్పులు ఆకర్షించాయి. ఆలయ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆంధ్రజ్యోతి భీమవరం
భీమవరం, ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, పాలకొల్లు, నరసాపురం

21 నుంచి ప్రభుత్వాసుపత్రి పారిశుధ్య కార్మికుల సమ్మె

తణుకు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 21 నుంచి విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు తెలిపారు. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. వి.సాయికిరణ్, ఆర్ఎంవో డాక్టర్. తాతారావులకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాల బకాయిలు, 41 నెలలు పీఎఫ్ బకాయిలు చెల్లించాలన్నారు.

తాత్కాలిక లైసెన్సు దుకాణాల ఏర్పాటు

ఆకివీడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా వ్యాపారాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ ఫరూఖ్, ఎస్ఐ నాగరాజు, అగ్నిమాపకశాఖాధికారి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక చూట్ మెమోరియల్ (సీఎం) హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటుచేసుకుంటున్న 17తాత్కాలిక బాణసంచా దుకాణాల వర్తకులకు శుక్రవారం అవగాహన కల్పించి మాట్లాడారు. వర్తకులు బాణసంచాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 20న రాత్రి 6.30 గంటలకు దుకాణాలు బంద్ చేయాలన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి : మోటుపల్లి


దుకాణాల వర్తకులకు సంచులు అందచేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఆకివీడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిదని టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకట్రావు అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని దుకాణ వర్తకులకు పెద్దసైజు కవర్లు అందజేసి మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి నగర పంచాయతీ స్వచ్ఛంద సంస్థకు బాధ్యతలు అప్పగించడంతో నిర్వాహకులు ఉదయగిరి గంగాధరరావు, బొల్లా శేషుబాబు, బాదం శ్రీనులు ప్రజా ప్రతినిధులు, కమిషనర్ కృష్ణమోహన్, మేనేజర్ వెంకటేశ్వరరావుతో కలిసి సంచులు అందజేశారు. టీడీపీ పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు గంధం ఉమా, నౌకట్ల రామారావు, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి పాల్గొన్నారు.

అపోహలను నమ్మకండి.. సురక్షతో పరీక్షించుకోండి

తాడేపల్లిగూడెం రూరల్/ఆకివీడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):మద్యం నాణ్యతపై వస్తున్న అపోహలను గుడ్డిగా నమ్మకుండా ఆ మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను పరీక్షించడం ద్వారా నాణ్యత పరీక్షించుకోవచ్చని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ కేవీఎన్ ప్రభుకుమార్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పట్టణ ంలో మద్యం దుకాణాల వద్ద ఆయన స్వయంగా నాణ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మద్యం నాణ్యతపై ఎక్సైజ్ అధికారులు స్కాన్ చేసి చూపించారు. యాప్‌ద్వారా మద్యం ఎక్కడ తయారైంది. ఎప్పుడు తయారైంది తదితర అంశాలు తెలుస్తాయని వివరించారు. ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. ఆకివీడులో సురక్ష సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కరుణప్రియ అవగాహన కల్పించారు. శుక్రవారం పట్టణంలోని మద్యం దుకాణాలు, బార్‌ను వారు పరిశీలించి వినియోగదారులకు యాప్, క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పించారు.

పెన్షన్ల డ్యూటీలు బహిష్కరిస్తాం : ఆశా వర్కర్స్

ఆకివీడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు పెన్షన్ డ్యూటీలు వేస్తే విధులు బహిష్కరిస్తామని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కోశాధికారి లారెన్స్‌కుమారి అన్నారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించి అనంతరం కమిషనర్ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. జనాభాకు అనుగుణంగా ఆశాలను నియమించకుండా అనేక రకాల సర్వేలు, యాప్‌లు ద్వారా మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. రానున్న నవంబరు నెలలో పింఛన్లకు డ్యూటీలు వేస్తే బహిష్కరిస్తామని హెచ్చరించారు.

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి

నరసాపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భారీ వాహనాల డ్రైవర్లు పరిస్థితులకు అనుగుణంగా ఏకాగ్రతతో డ్రైవింగ్ చేసినప్పుడే ప్రమాదాలను నివారించవచ్చునని పాలకొల్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అజ్మీరబద్దు అన్నారు. శుక్రవారం మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనం నడిపేటప్పుడే వేగం కన్నా గమ్యం ముఖ్యమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ ఒత్తిళ్ళకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి త్రినాధ్, డైరెక్టర్ శ్రీహరి, రఘు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీవోపై న్యాయ పోరాటం : సర్పంచ్ సుజాత

నరసాపురం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ఉద్దేశపూర్వకంగానే పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశానని నివేదిక ఇచ్చిన డీఎల్‌పీవోపై తాను న్యాయ పోరాటం చేస్తానని మల్లవరం సర్పంచ్ సంది సుజాత తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తన హయాంలో ఎటువంటి అవినీతి జరగలేదన్నారు. అన్ని బిల్లులు సభ్యులు ఆమోదించిన తీర్మానం చేసిన తరువాతే బిల్లులు చెల్లించామన్నారు. అప్పటి చెల్లింపులన్ని ప్రత్యేక అధికారి, కార్యదర్శి హయాంలోనే జరిగాయన్నారు. డీఎల్‌పీవో అభ్యంతకరం అని చెప్పిన బిల్లులన్ని పాలకవర్గం ఆమోదం లేవన్నారు. రికార్డులు సక్రమంగా పరిశీలించకుండా తప్పుడు నివేదిక జిల్లా అధికారులకు పంపించడం సరికాదన్నారు.

కాపు నాయకుల సమావేశం

నరసాపురం టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాపు సంఘం నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షులు చినమిల్లి రాయుడు, నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సురేష్ పాల్గొని పలు విషయాలపై చర్చించారు. కార్తీక సమారాధన, సంఘం చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న పట్టణ కాపు సంఘం అధ్యక్షులు తమ్మిశెట్టి బాబ్జీని పరామర్శించారు.

గోడ నిర్మాణంలో నాణ్యత పాటించాలి

నరసాపురం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పీఎంలంక గ్రామంలో సముద్ర రక్షణ గోడ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి బలరాం డిమాండ్ చేశారు. శుక్రవారం గోడ నిర్మాణ పనుల్ని పరిశీలించారు. నిర్మాణ పనులపై అధికారుల పరివేక్షణ లేదని విమర్శించారు. 19కిలోమీటర్ల మేర ఉన్న సముద్రం కేవలం ఒక కిలోమీటర్‌లోనే గోడను కట్టడం సరికాదన్నారు.

ఎస్‌వీకేపీ స్వర్ణోత్సవాల్లో పాల్గొనాలి

పెనుగొండ/పెనుమంట్ర, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి):కళాశాలలో విద్యనభ్యసించిన ప్రతి ఒక్కరూ స్వర్ణోత్సవాలలో పాల్గొని జయప్రదం చేసి కళాశాలను వందేళ్ళ ఉత్సవానికి సిద్ధం చేయాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు అన్నారు. పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అటానమస్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సమోదు కార్యక్రమం చేపట్టారు.

తొమ్మిది మంది పేకాట రాయుళ్ల అరెస్టు

అత్తిలి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):పేకాడుతున్న తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు అత్తిలి ఎస్ఐ పి.ప్రేమరాజు తెలిపారు. అత్తిలిలో ఆరుగురుని అరెస్టు చేసి వారి నుంచి రూ.2350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తాడి శివరాజు మరో ఇద్దరు రామన్నపేటలో పేకాట ఆడుతుం డగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.10,450 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి డాక్టర్ తీగల రమేశ్ రాక

పెంటపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 19వ తేదీన విజయవాడ నుంచి ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేశ్ వస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ కొలనవాడ పెదకృష్ణంరాజు తెలిపారు. తల, మెదడు, వెన్నెముక, నరాలకు సంబంధించిన సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

సీఆర్‌పీలకు శిక్షణ

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త పరిశుభ్రత కార్యక్రమంలో ప్రజలను చైతన్యవంతులను చేసేందుకే ప్రభుత్వం సీఆర్‌పీల వ్యవస్థ ప్రారంభిస్తుందని తాడేపల్లిగూడెం ఇన్‌చార్జ్ డీఎల్‌డీవో మల్లికార్జునరావు పేర్కొన్నారు. మారంపల్లి ఎల్‌టీసీ సెంటర్ వద్ద తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో నూతనంగా ఎంపిక చేసిన సీఆర్‌పీలకు శిక్షణ ఇచ్చారు.





పెదఅమిరంలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు.. పాలమూరులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పితాని.. భీమవరంలో ఎమ్మెల్యే రామాంజనేయులు సమక్షంలో ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం.. తాడేపల్లిగూడెంలో కల్తీ లేని ఆహారంపై కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కృషి

ఆకివీడు రూరల్ అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రహదారులన్నీ అభివృద్ధి చేస్తామని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అన్నారు. సిద్ధాపురంలో రూ.39లక్షలతో నిర్మించిన పలు సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. గుమ్ములూరు-అప్పారావుపేట రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2.5కి.మీ రహదారికి రూ.1.60కోట్లు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఆగిపోయిన పెదకాపవరం-గణపవరం, పెదకాపవరం పాములుపర్రు రహదారి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. రహదారులు, కాలువగట్లు ఆక్రమణలకు గురి కాకుండా ప్రజలు అడ్డుకోవాలని అన్నారు. మండల టీడీపీ అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, జడ్పీటీసీ యండగండి శ్రీను, ఏఎంసీ ఛైర్మన్ వెంకట్రావు, ఎంపీపీ కఠారిజయలక్ష్మి, సర్పంచ్‌లు కోట అనంతలక్ష్మి, సౌజన్య, చిట్టిబాబు, ఉపసర్పంచ్ నారాయణరాజు, కోపల్లె సాయిబాబా, భూపతిరాజు తిమ్మరాజు పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

కాళ్ల: గ్రామాల్లో పారిశుధ్య పనులపై అధికారులు, నాయకులు శ్రద్ధ పెట్టి గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. పెదఅమిరం గ్రామంలో రాష్ట్రీయ రహదారి వెంబడి ఉన్న చెత్త, మట్టి తొలగింపు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోరా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పాలమూరు- నవుడూరు రోడ్డు పనులు

పెనుమంట్ర:పొలమూరు నుంచి నౌడూరు వరకు ప్రధాన రహదారి అభివృద్ధి పనులు రూ.2.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం పొలమూరు, గరువు గ్రామాల్లో పల్లెపల్లెకు పితాని కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలు,అధికారులతో కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పొలమూరులో ఏడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని వాటికి పిల్లల హాజరు తక్కువగా ఉండటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలను కేంద్రానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే పక్కన ఉన్న అంగనవాడి కేంద్రంలో విలీనం చేస్తామని ఎమ్మెల్యే పితాని అన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి మైక్రో ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటుకు రూ.20 లక్షలతో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సర్పంచ్ కాకర రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు వెలగల బుల్లి రామిరెడ్డి, నూర్ బాషా కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ జిన్నా పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పోడూరు:కొమ్ముచిక్కాల క్యాంపు కార్యాలయంలో వైద్యం చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు 25 మందికి రూ.8.43లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పితాని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కవిటం సొసైటీ ఛైర్మన్ ఉడిగ శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గుబ్బల అప్పన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ లేని ఆహారం అందించేందుకు కృషి

తాడేపల్లిగూడెం:కల్తీలేని ఆహారాన్ని రాష్ట్రప్రజలకు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని ప్రభుత్వం విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో శుక్రవారం కల్తీలేని ఆహారం, ఆరోగ్యం పరిరక్షణ అవగాహన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలి శెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కల్తీలేని ఆహారాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పారవేసే వారిపై రూ.10వేల జరిమానా విధించాలని ఆదేశాలు ఇచ్చారు.

మత్స్యపురి సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

వీరవాసరం(భీమవరం టౌన్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మత్స్యపురి సొసైటీలో గత పాలకులు అవినీతికి పాల్పడ్డారని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శుక్రవారం ది మత్స్యపురి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్‌గా పుప్పాల వీరవెంకట నరసింహారావు, డైరెక్టర్లుగా కత్తుల పద్మారావు, చింత పల్లి వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజిబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, మాజీ మంత్రి పీతల సుజాత, ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి సుజాత, కోళ్ళ నాగేశ్వరరావు, గంటా త్రిమూర్తులు పాల్గొన్నారు.

మత్స్యపురి గ్రామంలో శ్రీఉమా అగస్తేశ్వర స్వామి దేవాలయం నూతన పాలకవర్గ ఛైర్మన్‌గా దొంగ చింతారావు, సభ్యులుగా వీరవల్లి ఆదిలక్ష్మి, కే వెంకటరావు, గుబ్బల అన్నపూర్ణ, పి.దుర్గాదేవి, దిగమర్తి కోటేశ్వరీ, లక్ష్మీదుర్గ, చింతా గోపాల స్వామి, శ్రీనివాస ఆచారి ప్రమాణ స్వీకారం చేశారు. అదే గ్రామంలోని భూ సమేత జనార్దన స్వామి దేవాలయం నూతన పాలకవర్గ ఛైర్మన్‌గా దేవిరెడ్డి వెంకట రామకృష్ణ, సభ్యులుగా కిషోర్, ఫణీంద్ర, కొండలరావు, శ్రీలక్ష్మి, కరుణ, పద్మావతి ఆదిలక్ష్మి, లక్ష్మి కాంతంలు ప్రమాణ స్వీకారం చేశారు.

తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలి

కాళ్ళ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి చె త్త నుంచి సంపదను సృష్టించాలని డీపీఆర్పీ టీమ్ మెంబర్ ఎడ్వర్డ్ అన్నారు. ఏలూరుపాడులో చెత్త నుంచి సంపద సృష్టిపై కాళ్ళ, ఆకివీడు మండలాలకు చెందిన 49 మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్పీ)లకు ఒకరోజు శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. సీఆర్పీలు గ్రామంలోని ప్రతి కుటుంబానికి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడంపై అవగాహన కల్పించాలన్నారు. సర్పంచ్ భూపతిరాజు వెంకట జగ్గరాజు, ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు, ఆకివీడు డిప్యూటీ ఎంపీడీవో ఇ.మార్కండేశ్వరరావు, కార్యదర్శి ఎస్.అరుణాదేవి పాల్గొన్నారు.

మొదటి ఆయుర్వేద వైద్యుడు ధన్వంతరి

భీమవరం టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):మొదటి ఆయుర్వేద వైద్యుడు ధన్వంతరి అని, రోగాల నివారణకు ధన్వంతరి ఎంతగానో కృషి చేశారని వక్తలు అన్నారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శుక్రవారం ధన్వంతరి జయంతి సందర్భంగా జిల్లా నాయీ బ్రాహ్మణ జేఏసి అధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద, హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా నాయీ బ్రాహ్మణ జేఏసి ప్రెసిడెంట్ పట్నాల గణపతి, రఘుబాబు, పిప్పళ్ల ప్రసాద్, కోడూరి రామకృష్ణ, కార్యక్రమ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు అందజేత

కాళ్ళ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):డీఎస్సీ -2025 ద్వారా మండలంలో వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియామకం పొందిన 27 స్కూల్ అసిస్టెంట్లకు, ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఎస్టీయూ కాళ్ళ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వీస్ రిజిస్టర్లు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులకు ఉపయోగపడే అప్లికేషన్ ఫామ్స్, క్యాలెండర్లు, డైరీ అందించామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెంటపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):విద్యుత్ మరమ్మతులు కారణంగా ప్రత్తిపాడు, అలంపురం, బీ.కొండేపాడు గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎలక్ట్రికల్ ఈఈ నర్సింహమూర్తి తెలిపారు.

భూ సర్వేపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

పెంటపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భూసర్వే పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సర్వేయర్ అధికారి కె.జాషువా సూచించారు. శుక్రవారం పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలాల్లోని బీ.కొండేపాడు, పెదతాడేపల్లి గ్రామాలలో భూ సర్వేపై రైతులతో మాట్లాడారు. భూ సర్వే జరుగుతున్నట్లు ఎప్పటికప్పుడు సమాచారం వస్తుందా అంటూ రైతులను ఆరా తీశారు. సర్పంచ్ పోతుల అన్నవరం, తహసీల్దార్ సునీల్ కుమార్ పాల్గొన్నారు

వైద్య పరీక్షలు

పెనుగొండ, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మరియు పితాని వెంకన్న జూనియర్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్ర రాజు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు.

పంచాయతీల ప్రక్షాళనతోనే పల్లె పండుగ

పాలకొల్లు టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీలను ప్రక్షాళన చేయవలసిన అవసరం ఉన్నదని, అప్పుడే పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంటుందని రాష్ట్రీయ జన సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి వెంకట హరిరామ జోగయ్య విశ్లేషించారు. శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మురుగునీటి సమస్య, తాగు నీటి సమస్య, పేదల సంక్షేమం సక్రమంగా అమలు జరిగితేనే పంచాయతీ రాజ్ శాఖ నిజమైన ప్రజల అవసరాలు తీర్చడానికి చర్యలు చేపట్టారని భావించవచ్చని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి సౌకర్యాలు మెరుగు పరచాలని అన్నారు.

విత్తనాలు, ఎరువులు అందజేయడానికి ప్రతి గ్రామం, మండలంలో తగిన వ్యవస్థలను నెలకొల్పాలని అన్నారు. డ్వాక్రా సంఘాల సూపర్ విజన్ గ్రామ పంచాయతీల పరం చేయాలని అన్నారు. పల్లెల్లో పాఠశాలలు పర్యవేక్షణ, మధ్యాహ్న భోజన పథకాన్ని పంచాయతీలకు అప్పగించాలని తెలిపారు. గ్రామాల్లో వైద్యశాలలు నెలకొల్పి పంచాయతీల ద్వారా నిర్వహించాలని సూచించారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి


విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న చైర్మన్ భోగేశ్వరరావు

పెంటపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని టీబీఆర్ సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ లో విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు వరకు తమ ప్రాజెక్టు వర్కులను ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పద్మావతి, సీఈవో రవికిరణ్, ప్రిన్సిపాల్ కళ్యాణి, శిక్షకులు నవీన్, ఉదయ్ పాల్గొన్నారు.